సాక్షి కర్నూలు

శనివారం । 22 । జూలై । 2023



రూ.1.21 లక్షల విరాళం

కౌతాళం: ఉరుకుంద దేవాలయంలో చేపడుతున్న అన్నదాన పథకానికి, రాజగోపురం నిర్మాణానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన కనకండ్ల వెంకటేష్ రూ.1,21,000 విరాళంగా అందజేశారు.



శాస్త్రోక్తంగా ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి షోడశోపచార పూజలు జరిపించారు.



ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

ఎమ్మిగనూరు పట్టణం, నందవరం మండలంలో ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. కొన్ని పురుగు మందుల అమ్మకాలను నిలిపివేశారు. IIలో

న్యూస్‌రీల్

రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారుగా గంగుల



గంగుల ప్రభాకర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారుగా మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎమ్మెల్సీగా, శాసన మండలి విప్‌గా జిల్లాలో పార్టీకి, ప్రజలకు సేవలందించిన గంగుల ప్రభాకర్‌రెడ్డికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం కల్పించడం పట్ల స్థానిక పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశంలో నాడు–నేడు(విద్య), గృహ నిర్మాణం, వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా–పారిశుద్ధ్యం శాఖలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన జెడ్పీటీసీ, ఎంపీపీ, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ, జిల్లా గ్రంథాలయ సంస్థ, వాల్మీకి/బోయ, కుర్ని, వీరశైవ లింగాయత్, బెస్త కార్పొరేషన్ల చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు డిప్యూటీ సీఎం రాక

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.బి.అంజాద్ బాషా శనివారం కర్నూలు రానున్నారు. హైదరాబాద్ నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరి కర్నూలు చేరుకుంటారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కానున్న జిల్లా పరిషత్ జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరుకానున్నారు. అలాగే రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం కూడా ఈ సమావేశానికి హాజరుకానున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ

కర్నూలు(అర్బన్): యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలకు జిల్లాలోని నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాలకు చెందిన పట్టభద్రులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జె.రంగలక్ష్మీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి బ్రాంచీలలో ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. ప్రవేశ పరీక్ష మార్కుల ఆధారంగా రిజర్వేషన్ నిబంధనలకు లోబడి కమ్యూనిటీ వారీగా అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. విశాఖపట్నంలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌కు, విజయవాడలో ఏపీపీఎస్సీ గ్రూప్–1 సర్వీసెస్‌కు, తిరుపతిలో ఏపీపీఎస్సీ గ్రూప్–2 సర్వీసెస్‌కు శిక్షణ కేంద్రాలు ఉన్నాయన్నారు. వార్షిక ఆదాయం రూ.6 లక్షలకు మించని వారు ఆన్‌లైన్‌లో ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు apstdc.apcfss.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.

డీఐఈపీసీ ఉపాధ్యక్షుడిగా హనుమంతరెడ్డి



కర్నూలు (టౌన్): జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) వైస్ చైర్మన్‌గా పాటిల్ హనుమంతరెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ ప్రత్యేక కార్యదర్శి కరికాల వలవన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి జిల్లా చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. వైస్ చైర్మన్‌గా ఎన్నికైన పాటిల్ హనుమంతరెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చారన్నారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు.

డీసీఎంఎస్ పాలకవర్గం పదవీకాలం పొడిగింపు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ పాలకవర్గం పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సహకార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి జీఓ 520 జారీ చేశారు. నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జీ కమిటీ చైర్‌పర్సన్‌గా సీహెచ్ శిరోమణి నేతృత్వంలోని పాలకవర్గం పదవీ కాలం ఈ నెల 23తో ముగియనుంది. తాజా ప్రభుత్వ ఉత్తర్వులతో చైర్‌పర్సన్‌గా సీహెచ్ శిరోమణి, సభ్యులుగా వంశీధర్‌రెడ్డి, జి.రామకృష్ణ, వినయ్‌కుమార్‌రెడ్డి, సుబాన్‌సాహెబ్, వెంకటబ్బమ్మ, దేవభూషణం డైరెక్టర్లుగా మరో ఆరు నెలల పాటు కొనసాగనున్నారు.

వ్యవసాయం చేస్తూ.. వ్యాపారంలో రాణిస్తూ!



మిర్చిని విక్రయిస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు

ఉద్యమంలా ఎఫ్‌పీఓల ఏర్పాటు

- ప్రతి ఎఫ్‌పీఓలో సభ్యులుగా 100 నుంచి 1,200 వరకు రైతులు
- ఉద్యాన శాఖ కలెక్షన్ సెంటర్ల నిర్వహణ బాధ్యతలు
- మార్కెటింగ్‌లో రాణిస్తున్న ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్‌లు
- ఎఫ్‌పీఓలకు ప్రభుత్వ ప్రోత్సాహం
- అవసరాలకు అనుగుణంగా బ్యాంకు రుణాలు

కర్నూలు(అగ్రికల్చర్): రైతు సమస్యలకు ఉత్పత్తిదారుల సంఘాలతో పరిష్కారం లభిస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక కార్యక్రమాలు ఎఫ్‌పీఓల ద్వారానే అమలు చేస్తోంది. వీటికి లభిస్తున్న విశేష ఆదరణ దృష్ట్యా కేంద్రం కూడా జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ) ద్వారా ఎఫ్‌పీఓల ఏర్పాటుకు చర్యలు చేపడుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫార్మర్స్ ప్రొడ్యూస్ గ్రూప్స్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. నాబార్డు, డీఆర్‌డీఏ–వైకేపీతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ఎఫ్‌పీఓల ఏర్పాటుపై చొరవ తీసుకుంటున్నాయి. ఉద్యాన శాఖ కూడా ఎఫ్‌పీఓలను ఏర్పాటు చేస్తుండటం విశేషం. మత్స్యశాఖ కూడా ఆ దిశగానే అడుగులు వేస్తోంది. వ్యవసాయ అనుబంధ శాఖలో ఎఫ్‌పీఓ ఏర్పాటు విప్లవాత్మక మార్పుగా నిలుస్తోంది. ఒకరు, ఇద్దరితో కాకుండా.. కలసికట్టుగా ఉంటే ఏదైనా సాధ్యమని నిరూపిస్తూ ఫార్మర్స్ ప్రొడ్యూస్ గ్రూపులు రాణిస్తున్నాయి. పంటలు పండించడం ఒక ఎత్తు అయితే.. మార్కెటింగ్ చేసుకోవడం మరో ఎత్తు. జిల్లాలో అన్ని రకాల ఉద్యాన పంటలు, వ్యవసాయ పంటలు పండుతున్నాయి. గతంలో పండించిన పంటలను మార్కెటింగ్ చేసుకోవడం రైతులకు పెద్ద సమస్యగా మారింది. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు అన్ని రకాల సమస్యలకు పరిష్కారం లభిస్తోంది.

ఎఫ్‌పీఓలతో అనేక సమస్యలకు పరిష్కారం

రైతన్నలు ఎదుర్కొనే అనేక రకాల సమస్యలకు ఫార్మర్స్ ప్రొడ్యూస్ గ్రూపుల ద్వారా పరిష్కారం లభిస్తోంది. ఉద్యాన శాఖ ఉత్పత్తుల సేకరణ కేంద్రాల ఏర్పాటును ఎఫ్‌పీఓలకే అప్పగించింది. నాబార్డు ద్వారా ఏర్పాటైన ఎఫ్‌పీఓలకే ఉద్యాన శాఖ కలెక్షన్ సెంటర్లను అప్పగించింది. ఉద్యాన శాఖ ఇప్పటికే 11 కలెక్షన్ సెంటర్లు సిద్ధం చేసింది. మరో ఐదు సెంటర్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. రైతులు పండించిన కూరగాయలు, పండ్లు, ఇతర పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేనప్పుడు ఎఫ్‌పీఓలు రైతుల నుంచి సేకరించి డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో విక్రయిస్తారు. వ్యవసాయ శాఖ ఉద్యాన శాఖ తదితర ప్రభుత్వ శాఖల ఇన్‌పుట్స్ అంటే టార్పాలిన్‌లు, స్ప్రేయర్లు, ఎరువులు, విత్తనాలు తదితరాలన్నీ ఎఫ్‌పీఓల ద్వారానే పంపిణీ అవుతాయి. ఎఫ్‌పీఓలు రసాయన ఎరువుల వ్యాపారం కూడా చేస్తూ కచ్చితమైన ధరలకే రైతులకు అందిస్తున్నాయి. రానున్న రోజుల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల కార్యక్రమాలన్నీ ఎఫ్‌పీఓల ద్వారానే అమలు చేయనున్నారు. విజిటబుల్ సోలార్ డ్రయర్లకు అవసరమైన టమాట, ఉల్లి కూడా ఈ సంఘాలే సరఫరా చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.



రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఎరువుల విక్రయం

సహకార సంఘాల్లోని సభ్యులతో ఎఫ్‌పీఓల ఏర్పాటు

కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కూడా ఎఫ్‌పీఓల ఏర్పాటుపై దృష్టి సారించింది. దేశ వ్యాప్తంగా 1,100 సహకార సంఘాలను ఎఫ్‌పీఓలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. కర్నూలు ఉమ్మడి జిల్లాలో 99 సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో పలు సంఘాలను ఎఫ్‌పీఓలుగా అభివృద్ధి చేసేందుకు కసరత్తు జరుగుతోంది. రూ.33 లక్షల సహాయం అందించి ఎఫ్‌పీఓలను ప్రోత్సహించడం, హ్యాండ్ హోల్డింగ్ చేయడం కోసం క్లస్టర్ ఆధారిత వ్యాపార సంస్థలకు(సీబీబీవోస్) అదనపు సాయం అందుతుంది.



వై.ఖానాపురం రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ప్రతినిధులతో నాబార్డు అధికారులు

ఎఫ్‌పీఓల ఎదుగుదలకు వ్యవసాయ అధికారుల అవరోధం

రైతు ఉత్పత్తిదారుల సంఘాల అభివృద్ధికి కొందరు వ్యవసాయ అధికారులు అవరోధం కలిగిస్తున్నారు. ఎఫ్‌పీఓలు ఎరువుల వ్యాపారం కూడా చేసుకోవచ్చు. అయితే మామూళ్లకు అలవాటు పడిన కొందరు వ్యవసాయ అధికారులు ఎఫ్‌పీఓలు ఎరువుల వ్యాపారం చేయకుండా అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆర్డర్ ఫామ్ ఇవ్వకుండా సంఘాల ప్రతినిధులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది.

పత్తికొండ కూరగాయల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ నాబార్డు సహకారం, నవయూత్ అసోసియేషన్ ప్రోత్సాహంతో 2020 సెప్టెంబర్‌లో 10 మంది డైరెక్టర్లతో ఏర్పాటైంది. నేడు ఎనిమిది గ్రామాల నుంచి 1000 మంది సభ్యులుగా ఉన్నారు. రైతులకు సేవలు అందించడంలో జిల్లాలో ఉన్న ఎఫ్‌పీఓల్లో ఈ సంస్థ మొదటి స్థానంలో ఉంది. 2022–23లో రూ.1.29 కోట్ల టర్నోవర్ చేయడం విశేషం.

టర్నోవర్ రూ.1.29 కోట్లు



కూరగాయల విక్రయం

ప్రతి సంఘానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- రైతు ఉత్పత్తిదారుల సంఘాలను కంపెనీల చట్టం కింద రిజిస్ట్రేషన్.
- సంఘాల నిర్వహణలో పారదర్శకతకు ప్రతి ఏటా ఆడిట్.
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాబార్డు ఆధ్వర్యంలో 27 ఎఫ్‌పీఓలు.
- నాబార్డు ఆధ్వర్యంలోని ఎఫ్‌పీఓలు స్వచ్ఛంద సంస్థల(ఎన్‌జీఓ) నిర్వహణ.
- డీఆర్‌డీఏ–వైకేపీ ద్వారా మహిళా రైతులతో 25 ఎఫ్‌పీఓల ఏర్పాటు.
- ఆంధ్రప్రదేశ్ డ్రౌట్ మిటిగేషన్ ప్రోగ్రామ్(ఏపీడీఎంపీ) కింద 21 ఎఫ్‌పీఓలు.
- సహకార శాఖ చట్టాల కింద 46 ఎఫ్‌పీఓల రిజిస్ట్రేషన్.
- ప్రతి ఎఫ్‌పీఓలో 100 నుంచి 1,200 వరకు రైతులు సభ్యులు.
- అవసరానికి అనుగుణంగా బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం.

సంఘాల సేవలు సంతృప్తికరం

రైతుల అభ్యున్నతికి నాబార్డు పెద్దపీట వేస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 27 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేశాం. ఇందులో నాలుగు నంద్యాల జిల్లాలో, 23 కర్నూలు జిల్లాలో ఉన్నాయి. పీటీడీఎఫ్ కింద 23, సీఎస్ఎస్ ఎఫ్‌పీఓ కింద 4 సంఘాలు ఏర్పాటయ్యాయి. పీటీడీఎఫ్ కింద ఏర్పాటైన సంఘాలకు రూ.11 లక్షలు, సీఎస్ఎస్ ఎఫ్‌పీఓలకు రూ.40 లక్షల ఆర్థిక సహాయం అందించాం. అన్ని సంఘాలు బాగా పనిచేస్తున్నాయి.

– సుబ్బారెడ్డి, డీడీఎం, నాబార్డు

లాభాల నుంచి సభ్యులకు డివిడెండు



నాబార్డు సహకారంతో వై.ఖానాపురం రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌ను నాలుగేళ్ల క్రితం స్థాపించాం. కూరగాయలు సేకరించి ఇతర ప్రాంతాల్లో విక్రయించడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నాం. కంపెనీకి రూ.5 లక్షల లాభం రాగా సభ్యులకు డివిడెండు అందించాం. ఉద్యాన శాఖ ద్వారా వెండింగ్ వ్యాన్, కోల్డ్ స్టోరేజ్ రూము మంజూరయ్యాయి.

– బడేసావ్, కంపెనీ చైర్మన్

ఆశాజనకంగా వర్షాలు

- సాగులోని పంటలకు ఊపిరి పోస్తున్న వర్షాలు
- విత్తన పనులు ఊపందుకునే అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): వాయువ్య బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. రెండు, మూడు రోజులుగా తేలికపాటి వర్షాలు కురిసినా.. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అన్ని మండలాల్లో వర్షపాతం నమోదైంది. తాజా వర్షాల వల్ల సాగులోని పంటలు కోలుకుంటుండగా.. విత్తన పనులు ఊపందుకునే అవకాశం ఏర్పడింది. కర్నూలు జిల్లా కోసిగిలో అత్యధికంగా 26.2 మి.మీ అత్యల్పంగా చిప్పగిరిలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. సగటున 14.6 మి.మీ వర్షపాతం నమోదు కావడం విశేషం. ఖరీఫ్ సాధారణ సాగు 4.21 లక్షల హెక్టార్లు ఉండగా ఇప్పటి వరకు పత్తి, వేరుశనగ, కంది, సజ్జ, మొక్కజొన్న, ఆముదం పంటలు 70,019 హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి. వర్షాభావం వల్ల సాగు చేసిన పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. అల్పపీడన ప్రభావం వల్ల కురుస్తున్న వర్షాల వల్ల పంటలు కోలుకుంటున్నాయి. జూన్ నెలలో 40 శాతం లోటు వర్షపాతం ఉంది. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 55.8 మి.మీ వర్షం కురిసింది. రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు ఊరటచెందుతున్నారు. మరోవైపు ప్రత్యామ్నాయ పంటల సాగుకు వ్యవసాయ శాఖ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది.

ప్రాంతం	వర్షపాతం (మి.మీ)
పత్తికొండ	26.2
ఎమ్మిగనూరు	22.4
మంత్రాలయం	22.2
కౌతాళం	22.0
దేవనకొండ	18.6
నందవరం	18.6
పెద్దకడుబూరు	18.4
గూడూరు	17.4
ఆదోని	16.4
సీ.బెళగల్	15.2
జూపాడుబంగ్లా	16.8
మిడుతూరు	16.6
నందికొట్కూరు	15.6
కొత్తపల్లి	15.4

చేనేతకు మరింత సాయం



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్, జేసీ నారపురెడ్డి మౌర్య తదితరులు

- చంద్రబాబు అంటే మోసం.. జగనన్న అంటే సాయం
- వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే సుధాకర్, జేసీ మౌర్య
- జిల్లాలో 3,461 మంది బ్యాంక్ ఖాతాల్లో రూ. 8.30 కోట్లు జమ

కర్నూలు(సెంట్రల్): చేనేత రంగానికి రాష్ట్ర ప్రభుత్వం మరింత సాయం, ప్రోత్సాహం అందిస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జే.సుధాకర్ అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్న సమయంలో చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకునే వారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చేనేత రంగం పూర్వ వైభవాన్ని సంతరించుకుందన్నారు. చంద్రబాబు అంటే మోసమని, జగనన్న అంటే సాయమని రుజువైందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. శుక్రవారం సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి జిల్లా వెంకటగిరి నుంచి వరుసగా ఐదో ఏడాది వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం కింద చేనేత కార్మికులకు ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. ఒక్కో చేనేత కుటుంబానికి రూ.24 వేలుచొప్పున ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి వారి వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా కలెక్టరేట్ నుంచి జేసీ నారపురెడ్డి మౌర్య, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జే.సుధాకర్, చేనేత, జౌళి శాఖాధికారి నరసింహారెడ్డి, లబ్ధిదారులు వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ.. చేనేత కుటుంబాలను ఆదుకున్న చరిత్ర జగనన్నకే దక్కుతుందన్నారు. జిల్లాలోని కోడుమూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో అత్యధికంగా చేనేత కార్మికులు ఉన్నారని, వారికి ఆర్థిక సాయం చేయడం అభినందనీయమన్నారు. చేనేత కార్మికులు వేసిన వస్త్రాలను అమేజాన్, ఫ్లిప్‌కార్టు, పేటీఎం పే తదితర కమర్షియల్ సైట్లలో అమ్ముకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. జేసీ నారపురెడ్డి మాట్లాడుతూ..జిల్లాలో అర్హులైన 3,461 మంది చేనేత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.24 వేలుచొప్పున రూ. 8.30 కోట్లను అందించినట్లు చెప్పారు. అత్యధికంగా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 1,978 మంది లబ్ధిదారులకు రూ.4.74 కోట్లు, కోడుమూరు నియోజకవర్గంలో 1,046 మంది లబ్ధిదారులకురూ.2.51 కోట్లు, ఆదోనిలో 318 మందికి రూ. 0.76 కోట్లు, పత్తికొండలో 65 మందికి రూ.0.15 కోట్లు, మంత్రాలయంలో 13 మందికి 0.3 కోట్లు, ఆలూరులో 7 మందికి రూ.01.68 కోట్లు, కర్నూలులో 34 మందికి రూ.0.8 కోట్ల మేర లబ్ధి పొందినట్లు వివరించారు. అనంతరం రూ.8.03 కోట్లకు సంబంధించిన మెగా చెక్కును ఎమ్మెల్యే, అధికారులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జౌళి శాఖ ఏడీఓలు పెద్దయ్య, శ్రీవాణి పాల్గొన్నారు.

మా కన్నీళ్లు తుడిచారు



జగనన్న వచ్చాక మా పరిస్థితులు మారాయి. మేం నేసిన చీరలకు ఆన్‌లైన్ సైట్లలో మంచి గిరాకీ ఉంది. ప్రభుత్వం ప్రతి ఏటా ఇస్తున్న రూ.24 వేలతో మగ్గం మరమ్మతులు, అవసరమైన దారాలు, ఇతర వస్తువులను కొనుగోలు చేస్తున్నాం. మా ఆర్థికాభివృద్ధికి జగనన్న ఎంతో సహకరించారు. మా కన్నీళ్లు తుడిచారు. అన్నకు ఎప్పటికీ రుణ పడి ఉంటాం.

– బి. సుశీల, ఎమ్మిగనూరు, ఎల్లమ్మ గుడి వీధి

జగనన్నే మా పెద్దన్న



మా వస్త్రాలు ధరించిన వారు ఎంతో అందంగా కనిపించినా..మా బతుకులు దుర్భరంగా ఉండేవి. చేసిన పనికి కనీసం కూలీ కూడా పడేది కాదు. జగనన్న పాదయాత్రలో మా కష్టాలను చూసిచలించిపోయారు. ప్రతి యేటా రూ.24 వేలు ఇస్తున్నారు. అంతేగాక వస్త్రాలను అమ్ముకోవడానికి మార్కెటింగ్ సాయం చేస్తున్నారు. జగనన్నే మా పెద్దన్న.

– సి.పద్మావతి, శివన్న నగర్, ఎమ్మిగనూరు

అండగా నిలిచారు



మాకు ఐదేళ్లుగా వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ఇస్తున్నారు. కరోనా సమయంలోనూ మాకు అండగా నిలిచారు. ఆర్థిక ఇబ్బందులు లేకుండా డబ్బులు ఇచ్చారు. ఇవే గాక వైఎస్సార్ చేయూత, ఆసరా, రైతు భరోసా, ఇతర పథకాలు కూడా మాకు వర్తిస్తాయి.

– కేబీ సరోజ, ఎమ్మిగనూరు, ముగతి పేట

రూ.75 కోట్లతో నూతన క్యూ కాంప్లెక్స్

- శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో రూ.75 కోట్లతో నూతన క్యూకాంప్లెక్స్ నిర్మాణానికి పరిపాలన అనుమతులు వచ్చాయని, త్వరలోనే టెండర్లు పిలుస్తామని శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి తెలిపారు. శుక్రవారం దేవస్థాన పరిపాలన భవనంలో ధర్మకర్తల మండలి సమావేశాన్ని నిర్వహించారు. దేవస్థాన చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో మొత్తం 19 అంశాలు అజెండా అంశాలు ప్రవేశపెట్టగా వాటిలో 18 అంశాలకు బోర్డు ఆమోదం తెలిపింది. ఒక అజెండాను వాయిదా వేశారు. అలాగే గతంలో ప్రవేశపెట్టిన 6 అంశాలను కూడా బోర్డు ఆమోదం తెలిపింది. అనంతరం ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని ఘనంగా సన్మానించారు. సమావేశంలో శ్రీశైల దేవస్థాన ఈఓ ఎస్.లవన్న, ధర్మకర్తల మండలి సభ్యులు ఓ.మధుసూదన్ రెడ్డి, మేరాజోత్ హనుమంత్‌నాయక్, మఠం విరూపాక్షయ్యస్వామి, ఎం.విజయలక్ష్మి, డా.కనకదుర్గ, మురళీ నరసింహారెడ్డి, సుజాత పాల్గొన్నారు.




ధర్మకర్తల మండలి సమావేశంలో పాల్గొన్న చైర్మన్, ఈఓ, శ్రీశైలం ఎమ్మెల్యే తదితరులు

వేరుశనగ, పత్తికి దిగుబడి ఆధారిత బీమా

- ప్రతిపాదనలు పంపాలని ఆదేశించిన జేసీ
- జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఎస్సీ రైతులకు ప్రకృతి వ్యవసాయం కిట్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాధారం కింద సాగు చేసిన వేరుశనగ, పత్తికి దిగుబడి ఆధారిత బీమా సదుపాయాన్ని కల్పించే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని వ్యవసాయ శాఖ అధికారులను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి, కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. సీసీఆర్‌సీ కార్డులు పొందిన సాగుదారులందరికీ అన్ని రకాల ప్రభుత్వ ప్రయోజనాలు వర్తింపజేయాలన్నారు. పశు సంచార వైద్యశాలలు (1962) రోజుకు 6 కాల్స్‌కు అటెండ్ కావాలన్నారు. పీఎం కిసాన్ కింద రైతులతో ఈ–కేవైసీ చేయించడం ఐదు శాతం పెండింగ్‌లో ఉందని, దీనిని కూడా సత్వరం పూర్తి చేయాలన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓర్వకల్లు మండలంలో అనేక మంది రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారం రాలేదని, అందరికీ న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. టీడీపీ హయాంలో రైతులు నిర్మించుకున్న మినీ గోకులాలకు బిల్లులు సత్వరం చెల్లించే విధంగా చూడాలని జేసీని కోరారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు ఉచిత పంటల బీమాతో పాటు పశుబీమాపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితులు, ఇతర వర్గాల రైతులు 1,648 మందికి ప్రకృతి వ్యవసాయం కిట్లను అందజేశారు. సమావేశంలో డీఏవో పీఎల్ వరలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసకుమార్, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ దుర్గాప్రసన్నబాబు, జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామల తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయం కిట్లతో జేసీ నారపురెడ్డి మౌర్య, ఎమ్మెల్యే కాటసాని తదితరులు

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన సదస్సులు

కర్నూలు(సెంట్రల్): మాదక ద్రవ్యాల(డ్రగ్స్) వినియోగంతో కలిగే అనార్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని విద్యాశాఖాధికారులను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణపై సెబ్ అదనపు ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అన్ని పాఠశాలలు, కళాశాలలు, సచివాలయాల దగ్గర డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలపై బ్యానర్లను ఏర్పాటు చేయాలన్నారు. డ్రగ్స్ తీసుకుంటున్న వారిని గుర్తించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో డి అడిక్షన్ సెంటర్‌కు లేదంటే సెబ్ కార్యాలయానికి పంపిన కౌన్సెలింగ్ ఇవ్వాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య ఆదేశించారు.మెడికల్ షాపుల యజమానులకు డాక్టర్ ప్రిస్కిప్షన్ ఉంటేనే మందులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్‌కు సూచించారు. బస్సుల్లో డ్రగ్స్ రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఆర్ఎం వెంకటరామం ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఆర్డీఓలు హరి ప్రసాదు,మోహన్‌దాస్, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ యుగంధర్‌బాబు, డీఎఫ్ఓ పి. శివశంకర్‌రెడ్డి, అసిస్టెంట్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రమాదేవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి కసరత్తు

- ఉమ్మడి జిల్లాలో 1,761 ఎస్‌జీటీ పోస్టులు ఖాళీ
- మిగిలిపోయిన 98 డీఎస్సీ అభ్యర్థులతో భర్తీకి సమాలోచనలు
- కేజీబీవీ నియామకాల్లో స్కిల్ టెస్ట్‌కు ఎంపికైన వారికి సైతం అవకాశం


డీఈఓ కార్యాలయం

కర్నూలు సిటీ: జిల్లా పశ్చిమ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. 1998 డీఎస్సీలో ఇంకా 329 మంది అర్హులు మిగిలిపోయినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. వీరందరూ తమకు కూడా ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వీరితో పోస్టులు భర్తీ చేసేందుకు సమాలోచనలు జరుపుతున్నారు. ఇటీవల జిల్లాలోని ఆదోని డివిజన్‌లోని ప్రభుత్వ స్కూళ్లను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆదోని పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీలోని మున్సిపల్ స్కూల్‌ను విజిట్ చేశారు. ఆ స్కూల్‌లో సుమారుగా 750 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే నలుగురు టీచర్లు మాత్రమే పనిచేస్తున్నట్లు సెక్రటరీ దృష్టికి వచ్చింది. దీంతో వెంటనే మున్సిపల్ స్కూళ్లలో పనిచేసే టీచర్లను సర్దుబాటు ద్వారా భర్తీ చేయాలని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగంను ఆదేశించారు. మువ్వా రామలింగం జిల్లాలో మూడు రోజుల పాటు ఉండి మున్సిపల్ స్కూళ్లలో టీచర్లను సర్దుబాటు చేశారు. అదే విధంగా ఆదోని డివిజన్‌లోని స్కూళ్లలో పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తున్నారు. ముందుగా ఉమ్మడి జిల్లాలో 98 మంది స్కూల్ అసిస్టెంట్లు అదనంగా ఉన్నట్లు గుర్తించారు. వీరందరినీ ఆదోని డివిజన్‌లోని హైస్కూళ్లలో సర్దుబాటు చేయనున్నారు.

1998 డీఎస్సీ అర్హులకు అవకాశం

ఉమ్మడి జిల్లాలో సుమారుగా 2,805 ప్రభుత్వ యాజమన్యాల పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 4.11 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థులకు చదువు చెప్పేందుకు కావాల్సిన టీచర్లు ఆదోని డివిజన్ లేరు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రత్యేకంగా ఖాళీలను భర్తీ చేసే దిశగా చర్యలు తీసుకుంటుంది. ఈ అంశంపై రెండు రోజుల క్రితం విజయవాడలో ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, జేడీ మువ్వా రామలింగం సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఖాళీలను 1998 డీఎస్సీ అర్హులతో భర్తీ చేసేందుకు సమాలోచనలు చేశారు. అలాగే ఇటీవల కేజీబీవీల్లో ఒక పోస్టుకు ముగ్గురు చొప్పున స్కిల్ టెస్ట్‌కు పిలిచారు. వీరిలో ఒకరికి మాత్రమే ఉద్యోగం వచ్చింది. మిగిలిన ఇద్దరిని కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఎంపిక చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. 98 డీఎస్సీలో జిల్లాలో 329 మంది, కేజీబీవీ నియమాకాల్లో స్కిల్ టెస్ట్‌కు హాజరై, ఉద్యోగం పొందలేక పోయిన సుమారు 445 మందిని నియమించే అవకాశం ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. అయితే వీరందరినీ ఆదోని డివిజన్ పరిధిలోని ఖాళీల్లో భర్తీకి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. వీరందరినీ నియమించినా ఇంకా వెయ్యి పోస్టులదాకా అవసరం ఉండగా, డీఎస్సీ నిర్వహించి, భర్తీ చేసేంత వరకు ఇన్‌స్ట్రక్టర్లను నియమించే అవకాశం ఉంది.

1998 డీఎస్సీ అర్హుల వివరాలు అడిగారు



ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ఇటీవల జరిగిన వెబెక్స్‌లో 1998 డీఎస్సీ అర్హులై ఇంకా ఎంత మంది ఉద్యోగాలు రావాల్సిన వారు ఉన్నారో వివరాలు అడిగారు. ఈ నెల 25లోపు 1998 డీఎస్సీకి సంబంధించిన ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది. ఆదోని ప్రాంతంలోని ఖాళీలపై ప్రత్యేక దృష్టి పెట్టాం.

– వి. రంగారెడ్డి, డీఈఓ

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతి చెందిన విజయ్

కోవెలకుంట్ల: చిన్న కొప్పెర్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. రేవనూరు ఎస్ఐ కల్పన అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన పెద్దన్న, లక్ష్మమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు విజయ్(23) పెద్దకొప్పెర్ల గ్రామానికి చెందిన ఓ రైతు పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. వరి నారుమడికి సాగునీరు మళ్లించే క్రమంలో మోటారు స్టార్టర్‌ను ఆన్ చేయబోయాడు. కాగా అప్పటికే విద్యుత్ ప్రసరించడంతో విద్యుదాఘాతంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. పక్క పొలం రైతులు చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుని భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

భర్త నాలుక కొరికిన భార్య


గాయపడిన చందునాయక్

తుగ్గలి: గొడవ పడి భర్త నాలుకను భార్య కొరికిన ఘటన తుగ్గలి మండలం ఎల్లమ్మగుట్ట తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఎల్లమ్మగుట్ట తండాకు చెందిన పుష్పావతికి పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన చందూనాయక్‌తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరు తండాలోనే నివాసం ఉంటున్నారు. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య తరచూ గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం చందూనాయక్ నాలుకకు తీవ్ర గాయమైంది. చనువుగా ఉన్న సమయంలో భార్యనే భర్త నాలుక కొరికి గాయపరిచిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇంత వరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని జొన్నగిరి ఎస్ఐ రామాంజినేయులు తెలిపారు.

కారు మెకానిక్ దుర్మరణం


ప్రమాద దృశ్యం

డోన్ టౌన్: కర్నూలు – బెంగళూరు జాతీయ రహదారిపై డోన్ పట్టణ సమీపంలో కంబాలపాడు సర్కిల్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మెకానిక్ దుర్మరణం చెందాడు. కృష్ణగిరి మండలం కోయిలకొండ గ్రామానికి చెందిన ఉంకయ్య, అరుణ దంపతుల కుమారుడు పెద్దయ్య (19) డోన్‌లో కారు మరమ్మతుల షెడ్డులో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో రిపేర్ పూర్తయిన కారును ట్రయల్ రన్ చేసేందుకు జాతీయ రహదారిపై వెళ్తుండగా కంబాలపాడు సర్కిల్ వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న పెద్దయ్య తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్ఐ నగేష్, డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతుడి తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ తెలిపారు.

కుక్కల దాడిలో ముగ్గురికి తీవ్రగాయాలు

బనగానపల్లెరూరల్: జోలాపురం గ్రామంలో శుక్రవారం ముగ్గురిపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. గ్రామానికి చెందిన మద్దుగారి మాబుహుస్సేన్, రమీజా బీ, ఇటిక్యాల వెంకట లచ్చమ్మ పని మీద రహదారిపై వెళ్తుండగా కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వీరిని చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేసి దాడికి చేస్తున్నాయి. వారం రోజుల్లో 20 మందిపై దాడి చేశాయని, గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుని కుక్కల బెడద నుంచి రక్షించాలని కోరారు.

గేదెలు మేపేందుకు వెళ్లి..


మృతి చెందిన పాములేటి

మహానంది: గేదెలు మేపేందుకు పొలాల్లోకి వెళ్లిన ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన గాజులపల్లెలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన బుంగిరి గేరెన్న, చిన్న నరసమ్మ దంపతులకు ఐదుగురు సంతానం. వారిలో చివరి వాడైన పాములేటి(29) బర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బనవాపురం సమీపంలోని పంట పొలాలకు వెళ్లాడు. రైతు కొలిమి ఇబ్రహీం పొలంలో మేపుకుంటుండగా ప్రమాదవశాత్తు స్తంభానికి సపోర్టుగా ఉన్న స్టేవైర్‌ను పట్టుకున్నాడు. అయితే విద్యుత్ బల్బు కోసం రైతు ఏర్పాటు చేసుకున్న వైర్లలో ఒక వైర్ స్టేవైర్‌కు తగలడంతో విద్యుదాఘాతంతో పాములేటి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. మృతుడి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ ఏడీఈ సతీష్‌రెడ్డి, సబ్ ఇంజినీర్ శంకర్, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

బీసీ, ఈబీసీలకు ఉపకార వేతనాలు


పీ వెంకటలక్షుమ్మ

కర్నూలు(అర్బన్): జిల్లాలో అర్హత కలిగిన 9, 10, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న బీసీ, ఈబీసీ, సంచార జాతులకు చెందిన విద్యార్థులకు పీఎం యశస్వి (పీఎం యంగ్ అచీవ్‌మెంట్ స్కాలర్‌షిప్ అవార్డ్ స్కీం ఫర్ వైబ్రంట్ ఇండియా) ఉపకార వేతనాలు అందించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ .. అర్హత కలిగిన విద్యార్థులు https//yet.nta.ac.inలో ఆగస్టు 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.50 లక్షల లోపు ఉండాలన్నారు. ఈ ఉపకార వేతనాలు పొందేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సెప్టెంబర్ 29న ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ మార్కుల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకం కింద ఎంపికైతే 9, 10 తరగతుల విద్యార్థులకు ఏడాదికి రూ.75 వేల వరకు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఏడాదికి రూ.1.25 లక్షల వరకు కళాశాల, హాస్టల్ ఫీజులకు విడుదల చేస్తారన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తుకు తమ ఫోన్ నంబర్, ఆధార్, ఆధార్ కార్డుతో లింక్ అయిన బ్యాంక్ పాసు పుస్తకం, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు.

డిప్యూటీ డీఈఓ ఆఫీస్‌లకు ఎన్ఎంఎంఎస్ మెరిట్ కార్డులు

కర్నూలు సిటీ: జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)లో ఎంపికైన విద్యార్థుల మెరిట్ కార్డులను డిప్యూటీ డీఈఓ ఆఫీస్‌లకు పంపించినట్లు డీఈఓ డా.వి రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ త్వరలోనే ఓపెన్ అవుతుందని, ఎంపికైన ప్రతి విద్యార్థి ఏదైనా జాతీయ బ్యాంకులో సేవింగ్స్ అకౌంట్ తీసుకుని తండ్రి, తల్లిని జాయింట్ చేసుకోవాలన్నారు. విద్యార్థి ఆధార్‌కార్డును మాత్రమే అకౌంటుకు జత చేయాలని, సేవింగ్స్ అకౌంటు కాకుండా వేరే విధమైన అకౌంట్లు(సుకన్య, ఫిక్స్‌డ్ డిపాజిట్ తదితర)పని చేయబోవని తెలిపారు. విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేది, మెరిట్‌కార్డులో ముంద్రించిన విధంగా మాత్రమే ఆధార్ కార్డులోను, బ్యాంక్ పాస్ బుక్‌లోను ఉండాలని సూచించారు.

ఇంటర్న్‌షిప్‌కు ఆర్‌యూ విద్యార్థిని


నర్రెడ్డి ఐశ్వర్య

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగో సంవత్సరం సివిల్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థిని నర్రెడ్డి ఐశ్వర్య ముంబై ఐఐటీలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైనట్లు వైస్ చాన్సులర్ ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మొదటి విడతలో 35 మంది విద్యార్థులు ఎంపికవ్వగా ఆంధ్రప్రదేశ్ నుంచి రాయలసీమ యూనివర్సిటీ ఇంజినీరింగ్ విద్యార్థి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. విద్యార్థినికి జ్ఞాపిక ఇచ్చి వీసీ ఆనందరావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.హరి ప్రసాద్ రెడ్డి, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి జి.వినోద్ కుమార్ అభినందనలు తెలియజేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


కలెక్టర్ మనజీర్ జిలానీకి వినతి పత్రం అందజేస్తున్న మహిళా ఉద్యోగిని

బొమ్మలసత్రం: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రాంతాల నుంచి 47 మంది ఉద్యోగులు వినతి పత్రాలు అందజేశారన్నారు. ప్రతి నెల 3వ శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నామన్నారు. వినతులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఇన్‌టెక్ వెల్ నిర్మాణ పనులు


ఇన్‌టెక్ వెల్ నిర్మాణం చేపట్టనున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఈఎన్‌సీ ఆనందరావు

ఆళ్లగడ్డ: పట్టణానికి తాగునీరు అందించే ప్రాజెక్ట్‌లో భాగంగా గండ్లేరు రిజర్వాయర్‌లో నిర్మించనున్న ఇన్‌టెక్ వెల్ పనులు త్వరలో చేపడుతామని చీఫ్ ఇంజినీర్ ఆనందరావు తెలిపారు. పట్టణానికి తాగునీటి సౌకర్యం రూ. 111 కోట్లతో చేపట్టిన ఏఐబీ పనుల్లో భాగంగా గండ్లేరు రిజర్వాయర్‌లో ఇన్‌టెల్ వెల్ నిర్మాణం చేపడుతున్న ప్రదేశాన్ని శుక్రవారం ఆయన అధికారులతో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు చేపడుతున్న మెగా ఇంజనీరింగ్ కంపెనీ అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులు త్వరగా నాణ్యతగా చేపట్టాలన్నారు. ఈ ప్రాజెక్ట్ పనులు పూర్తయితే ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కుటుంబానికి 24 గంటలు సమృద్ధిగా తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. ఈయన వెంట ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి, ఈఈ చంద్రమోహన్, డీఈ గంగాధర్, ఏఈలు విక్టర్‌బాబు, కరిముల్లా, సురేంద్ర ఉన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

- రూ. 68.5 లక్షల విలువ చేసే పురుగు ముందుల అమ్మకాలు నిలిపివేత


దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని శ్రీ సాయి బాలాజీ ట్రేడర్స్, పంచముఖి ఫర్టిలైజర్ దుకాణాల్లో రూ. 68.5 లక్షల విలువ చేసే రసాయన పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు స్పెషల్ స్క్వాడ్ ఏడీఏ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఏడీఏ వెంకటేశ్వర్లుతో పాటు ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, మండల వ్యవసాధికారి మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. శ్రీ సాయి బాలాజీ ఎరువుల దుకాణంలో నాణ్యత తక్కువగా ఉన్న పురుగు మందులను గుర్తించారు. రికార్డులో లేని రూ. 65 లక్షల పురుగు మందుల అమ్మకాలను నిలిపివేశారు. అలాగే పంచముఖి ఫర్టిలైజర్స్‌లో రూ. 3.5 లక్షల విలువైన పురుగు మందుల అమ్మకాలను నిలిపేసినట్లు అధికారులు తెలిపారు.

అనుమతుల్లేని మందులు విక్రయిస్తే చర్యలు

నందవరం: అనుమతుల్లేని ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి దుకాణదారులను హెచ్చరించారు. బిల్లు బుక్స్, సరైన అనుమతి పత్రాలు లేని కారణంగా రూ.6,16,648 విలువ చేసే పురుగు మందుల అమ్మకాలను నిలిపి వేశారు. శుక్రవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో స్పెషల్ స్క్వాడ్ ఏడీఏ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారిణి మర్రి స్రవంతి, ఏడీఏ మహమ్మద్ ఖాద్రి ఎరువుల దుకాణలను తనిఖీ చేశారు. చైతన్య ట్రేడర్స్ దుకాణంలో సరైన ధ్రువ పత్రాలు, బిల్లు లేని కారణంగా రూ.6.16 లక్షలు విలువ చేసే మందులను సీజ్ చేసి విక్రయాలు నిలిపి వేశారు. సరైన అనుమతి పత్రాలు చూపిస్తే అమ్మకాలకు అనుమతులు ఇస్తామని అధికారులు తెలిపారు. తనిఖీల్లో ఏఈఓ సురేంద్రగౌడ్ పాల్గొన్నారు.

వైద్యులు నైపుణ్యాలు పెంచుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ వసంతకుమార్

కర్నూలు(హాస్పిటల్): వైద్యులు పోటీ రంగంలో ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని ఏపీ కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎ.వసంతకుమార్ చెప్పారు. కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కర్నూలు మెడికల్ కళాశాలలో కార్డియాలజిస్టుల రాష్ట్రస్థాయి సదస్సు ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా డాక్టర్ వసంతకుమార్ మాట్లాడుతూ వైద్యులు ఐదేళ్లకోసారి తమ సర్టిఫికెట్లను రెన్యువల్ చేసుకోవాల్సి ఉన్న తరుణంలో వారు తరచూ సీఎంఈలు, కాన్ఫరెన్స్‌లలో పాల్గొని నాలెడ్జ్‌ను, నైపుణ్యాలను పెంచుకోవాల్సి ఉందన్నారు. ఆయా సదస్సుల్లో పాల్గొనడం వల్ల వచ్చే క్రెడిట్ హవర్స్‌ను పరిగణనలోకి తీసుకుని సర్టిఫికెట్లు రెన్యువల్ చేస్తారన్నారు. అనంతరం కళాశాలలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో పీజీలకు కేస్ డిస్కషన్స్‌పై డాక్టర్ దయాసాగర్ రావు, ఎక్స్‌రేపై డాక్టర్ కృష్ణంరాజు, ఎకోపై డాక్టర్ ఆంజనేయులు వివరించారు. కార్యక్రమంలో కార్యక్రమ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్, కార్డియాలజీ హెచ్ఓడీ డాక్టర్ పి.చంద్రశేఖర్, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన కార్డియాలజిస్టులు, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డుల జారీలో లక్ష్యాలు అధిగమించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): లక్ష్యం మేరకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయడంతో పాటు బ్యాంకుల నుంచి రుణాలు కూడా ఇప్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె తన చాంబర్‌లో ఏడీఏలు, సాంకేతిక ఏఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎం కిసాన్ లబ్ధి పొందుతున్న రైతుల్లో 95 శాతం మంది ఈ–కేవైసీ చేయించుకున్నారని, మిగిలిన 5 శాతం మంది రైతులతో కూడా ఈ–కేవైసీ చేయించాలన్నారు. పొలంబడి కార్యాక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని, చేపట్టిన కార్యక్రమాలను పొలంబడి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయని, ఈ నెల చివరిలోపు ఖరీఫ్ విత్తన పనులు ఊపందుకుంటాయన్నారు. కేడీసీసీబీ సీఇవో రామాంజనేయులు మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులు పొందిన సాగుదారులు రుణాల కోసం పీఏసీఎస్‌లను సంప్రదించాలని, నిబంధనల మేరకు రుణాలు అందజేస్తామన్నారు. సమావేశంలో ఏడీఏలు సాలురెడ్డి, గిరీష్, విజయమోహన్‌కుమార్, ఏవోలు రాఘవేంద్ర, అల్లీపీర, ఉషారాణి,సునీత, శారద తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వలంటీర్లకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.వెంకటనాగ శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్) : జిల్లా కోర్టు ఆవరణలో ఈ మధ్యకాలంలో ఏర్పాటైన శాశ్వత లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే వివాదాలపై శుక్రవారం వలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.వెంకట నాగ శ్రీనివాసరావు, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకట హరినాథ్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎం.శివరామచంద్రరావు మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్‌లు ఇచ్చే తీర్పులు సుప్రీం తీర్పులతో సమానమన్నారు.

ధ్యానంతో జ్ఞానం వృద్ధి



మాట్లాడుతున్న పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి

కర్నూలు కల్చరల్: మనిషి మానసిక ప్రశాంతతకు ధ్యానం చేయాలని తద్వారా జ్ఞానం లభిస్తుందని బ్రహ్మర్షి తటవర్తి వీర రాఘవరావు అన్నారు. స్థానిక రాఘవేంద్ర నగర్ సాయి సదన్‌లో మూడు రోజుల ధ్యాన శిక్షణ శిబిరం శుక్రవారం ప్రారంభమైంది. పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి శిబిరాన్ని ప్రారంభించి ప్రసంగించారు. బ్రహ్మర్షి పత్రీజీ జ్ఞాపకార్థం ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. తటవర్తి వీర రాఘవరావు మాట్లాడుతూ కర్నూలులో మొదటి పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ప్రత్రీజీ ప్రారంభించారన్నారు. ఆ తరువాత అనేక పిరమిడ్ ధ్యాన కేంద్రాలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో పుట్టుకొచ్చాయన్నారు. శిక్షణా శిబిరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ధ్యానులు పాల్గొన్నారు.

మసీదు స్థలాన్ని కాపాడాలి



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్) : కర్నూలు నగరంలోని ఉయ్యాల నరసింహారెడ్డి విగ్రహం నుంచి జొహరాపురం వెళ్లే రోడ్డులోని బుడ్డాబుడీ మసీదు స్థలాన్ని కబ్జాల నుంచి కాపాడాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..మసీదు మాన్యాన్ని కొందరు ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు సిద్ధపడుతున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నగర కమిటీ చైర్మన్‌గా రాధిక

కర్నూలు(రూరల్): కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ నగర మహిళా విభాగం చైర్మన్‌గా పి. రాధికను నియమించినట్లు డీసీసీ అధ్యక్షుడు సుధాకర్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ ఎలమందా రెడ్డి ఆదేశాల మేరకు ఆమెను నియమించినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆమెకు సూచించారు.

28 నుంచి హరినామ సంకీర్తన

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఈనెల 28వ తేదీ నుంచి హరినామ సంకీర్తన ఉత్సవం నిర్వహి స్తున్నట్లు ఇస్కాన్ కర్నూ లు బాధ్యులు రామకృష్ణ ప్రభు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.ఇస్కాన్ సభ్యులు,భక్తులు అందరూ పాల్గొని ఆధ్యాత్మిక ప్రశాంతత పొందాలన్నారు.

కంకర ఫ్యాక్టరీల తనిఖీ

కర్నూలు (న్యూసిటీ) : పాణ్యం మండలంలోని తమ్మరాజుపల్లెలో ఉన్న కంకర ఫ్యాక్టరీలను శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరాగినాయుడు ఆధ్వర్యంలో తనిఖీ చేసి రాయల్టీ పత్రాలు పరిశీలించారన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా కంకర ఫ్యాక్టరీలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త

కర్నూలు(హాస్పిటల్): సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ జె.నివాస్ చెప్పారు. శుక్రవారం ఆయన విజయవాడ నుంచి జిల్లా అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు బాగా కురుస్తున్నందున సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఇంటింటి సర్వే ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. జ్వరలక్షణాలు ఉన్న వారిని గుర్తించి చికిత్స చేయాలని చెప్పారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజ్, కమ్యూనికబుల్ డిసీజ్‌ల సర్వే మేరకు వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు అందించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య, టీబీ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్, డీఐఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీపీఎంయూ డాక్టర్ ఉమా, మలేరియా అధికారి నూకరాజు, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సత్వర సేవలు

- జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్
- లబ్ధిదారులకు వివిధ రకాల సేవల సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖన్, పార్టీ పరిశీలకుడు కర్ర హర్షవర్ధన్‌రెడ్డి

కర్నూలు (టౌన్) : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన సేవలను సత్వరం అందిస్తున్నట్లు కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం నగరంలోని 24వ వార్డు లక్ష్మీనగర్, 44 వ వార్డు సీతారామనగర్, 50 వ వార్డు కొత్తపేట ప్రాంతాల్లోని 60, 61, 127, 128, 114, 115 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యాలెండర్ ప్రకారం ప్రతి ఏడాది సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారన్నారు. ఏదైనా కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారికి కూడా అందజేయాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రతి సచివాలయం పరిధిలో వలంటీర్లు ఇంటింటికి తిరిగి సర్వే చేస్తున్నారన్నారు. ధ్రువీకరణ పత్రాలు అవసరమైన వారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే అందజేస్తామన్నారు. జగన్ ప్రభుత్వం పేదలదని.. వారికి మేలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని చెప్పారు. ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్ ఆర్‌సీపీ సర్కారును మరోసారి ఆశీర్వాదించాలన్నారు. ఇటీవల టీడీపీకి చెందిన కొందరు నాయకులు రోడ్ల పైకి వచ్చి ప్రజలపై కపట ప్రేమ చూపుతున్నారన్నారు. 14 సంవత్సరాలు పాలించిన ఆ పార్టీ పేదలకు చేసిందేమీ లేదన్నారు. అనంతరం ఆయా సచివాలయాల్లో దరఖాస్తుదారులకు ఆదాయ, కుల, కుటుంబ, నివాస తదితర సర్టిఫికెట్లను ఎమ్మెల్యే ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పార్టీ కర్నూలు అసెంబ్లీ పరిశీలకు కర్రహర్షవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, స్పెషల్ ఆఫీసర్లు, సచివాలయాల సిబ్బంది, సచివాలయాల కన్వీనర్లు, పార్టీ ముఖ్య నాయకలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.





జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో చిన్నపాటి వర్షానికే లీకేజీ దృశ్యాలు

కలెక్టరేట్‌కు చిల్లు!

- చిన్నపాటి వానకే చిత్తడిగా మారిన కార్యాలయం
- జిల్లా వ్యవసాయ అధికారి ఆఫీసులో యథావిధిగా లీకేజీలు
- మరమ్మతులు చేసినా ప్రయోజనం లేదని ఉద్యోగులు అసంతృప్తి

కర్నూలు(అగ్రికల్చర్): చిన్నపాటి వర్షానికే కలెక్టరేట్ కాంప్లెక్స్ చిత్తడిగా మారుతోంది. కర్నూలు నగరంలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 14.6 మి.మీ. వర్షం కురిసింది. ఈ స్వల్ప వానకే కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ శాఖ జిల్లా అధికారి కార్యాలయంతో పలు విభాగాల ఆఫీసుల భవనాలు కారుతున్నాయి. కమాండ్ కంట్రోల్ రూము దగ్గర లీకేజీలు మరింత ఎక్కువగా ఉన్నాయి. జిల్లా నీటియాజమాన్య సంస్థ, డ్వామా కార్యాలయాల్లోనూ లీకేజీలు ఉన్నాయి. కలెక్టరేట్ పైన గతంలో సిమెంటు ఇటుకలతో 3 అడుగుల ఎత్తు పిల్లర్లు నిర్మించారు. ఇటుకల పిల్లర్లు శిథిలమై పోవడంతో పై నుంచి వర్షపు నీరు కిందకు లీక్ అవుతుండటంతో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం తీవ్ర అసౌకర్యంగా ఉండేది. దీంతో ఈ కార్యాలయాన్ని సమూలంగా మరమ్మతులు చేసేందుకు వ్యవసాయశాఖ కమిషనర్ 10 నెలల క్రితం దాదాపు రూ.18 లక్షలు మంజూరు చేశారు. పనులను అప్పటి కలెక్టర్ కోటేశ్వరరావు ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ విభాగానికి అప్పగించి చేయించారు. అయితే, మరమ్మతులు చేసినా యథావిధిగా లీకేజీలు ఉండటంపై వ్యవసాయ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రూ.18 లక్షలు ఖర్చు చేసి మరమ్మతులు చేసినప్పటికి నీరు లీక్ అవుతుండటంతో వ్యవసాయ సిబ్బంది ఇంజినీరింగ్ అధికారులను పిలిపించి చూపించారు. కాగా లీకేజీలు ఎక్కువగా ఉండటంతో కలెక్టరేట్ మొత్తానికి రూ.6 కోట్లతో మరమ్మతులు చేపట్టడానికి రంగం సిద్ధమైంది.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): ఆపదలో ప్రాణాలు నిలిపే సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయానందబాబు చెప్పారు. చిన్నపిల్లల విభాగం, ఐఏపీ ఆధ్వర్యంలో శుక్రవారం నేషనల్ సీపీఆర్ డే సందర్భంగా స్థానిక గుత్తిరోడ్డులోని మాంటి ఇంటర్నేషనల్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయానందబాబు మాట్లాడుతూ కోవిడ్ అనంతరం ఇటీవల గుండెపోటు మరణాలు పెరిగాయని, అకస్మాత్తుగా చాలా మంది గుండెపోటుతో కుప్పకూలుతున్న సంఘటనలు చూస్తున్నామని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మరణాలు తగ్గించేందుకు సీపీఆర్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.గుండెపోటుకు గురైన వ్యక్తికి వెంటనే సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. ఈ మేరకు ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై శిక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఐఏపీ కార్యదర్శి డాక్టర్ వీరరత్నాకర్‌రెడ్డి, చిన్నపిల్లల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కృష్ణ, ప్రకాష్ ఆనంద్, నియోనెటాలజిస్టు డాక్టర్ భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

మెదడు వ్యాధులతో వైకల్యం, మరణాలు

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచంలో అత్యంత ఖరీదైన వ్యాధుల్లో మెదడుకు వచ్చే రుగ్మతలు అని, తద్వారా అధిక శాతం అంగవైకల్యం చెందడం, మరణాలు సంభవిస్తున్నాయని న్యూరోఫిజీషియన్ డాక్టర్ నాగసురేష్ చెప్పారు. వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగసురేష్ మాట్లాడుతూ భారత దేశంలో వివిధ నాన్ కమ్యూనికబుల్ న్యూరోలాజికల్ డిజార్డర్స్‌లో స్ట్రోక్ 37.9శాతం, మైగ్రేన్ తలనొప్పి 17.5శాతం, మూర్ఛ 11.3శాతం ఉందన్నారు. మానసిక, సామాజిక, శారీరక శ్రేయస్సు కోసం మెదడు ఆరోగ్య అవగాహన అవసరమని తెలిపారు. తద్వారా మెదడు వ్యాధులతో సంబంధం ఉన్న వైకల్యాన్ని తగ్గించడంలో ఉపయోగపడుతుందన్నారు. రోజూ కనీసం ఏడు గంటలు నిద్రపోవాలని, రోజూ వ్యాయామం చేయాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు సీటు బెల్ట్/హెల్మెట్ ధరించాలని, నిద్రపోవడానికి ఆరు గంటల ముందు నికోటిన్, కెఫిన్‌లకు దూరంగా ఉండాలని, ఆకుకూరలు, కూరగాయలు బాగా తీసుకోవాలని సూచించారు.

నేడు రైతుబజార్లలో సబ్సిడీపై టమాట పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని మూడు రైతుబజార్లలో శనివారం సబ్సిడీపై టమాట పంపిణీ చేయనున్నారు. మదనపల్లిలో శుక్రవారం మార్కెటింగ్ శాఖ అధికారులు ఆరు టన్నుల టమాట కొనుగోలు చేశారు.వినియోగదారులకు ప్రభుత్వం వాటిని కిలో రూ. 50 ప్రకారం పంపిణీ చేస్తుందని జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయసంచాలకులు నారాయణ మూర్తి తెలిపారు. సీ.క్యాంపు, అమీన్ అబ్బాస్‌నగర్, కొత్తపేట రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా పంపిణీ చేస్తామని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టమాట పంపిణీ పారదర్శకంగా నిర్వహించేందుకు మూడు రైతుబజార్లకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు.ఆధార్ లేదా రైస్‌కార్డుపై ఒక్కొక్కరికి కిలో ప్రకారం పంపిణీ చేస్తామని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆ శాఖ జేఏసీ చైర్మెన్ గణేష్ కోరారు. శుక్రవారం రాత్రి స్థానిక విద్యుత్ భవన్‌లో ఏజేసీ సమావేశం నిర్వహించారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో దశల వారీగా ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి రంగస్వామి, కన్వీనర్ లక్ష్మీకాంతరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

25న విద్యాసంస్థలు బంద్

కర్నూలు(రూరల్): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్, టీఎస్ఎస్ఎఫ్, ఎస్ఎస్‌యూఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘాల నేతలు శ్రీరాములు గౌడ్, నాగరాజు, రామాంజనేయులు శుక్రవారం సీ ఆర్ భవనంలో జరిగిన కార్యక్రమంలో పిలుపునిచ్చారు.

భూ రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు భూసేకరణ చేయాలి
- ఆర్‌డీఓలు, తహసీల్దార్లను ఆదేశించిన జేసీ నారపురెడ్డి మౌర్య



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): రెండో దశ భూ రీసర్వేను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆర్‌డీఓలు, తహసీల్దార్లతో పలు రెవెన్యూ అంశాలపై డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావుతో కలసి జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రీసర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వాల్యుయేషన్‌పై దృష్టి సారించాలని తహసీల్దార్లను ఆదేశించారు. రీసర్వేపై రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను విచారించాలన్నారు. కోడుమూరులో కొన్ని ప్రదేశాల్లో కొలతల్లో తేడాలు వచ్చాయని, వాటిని సరిచేసుకుంటున్నట్లు తహసీల్దార్ జేసీకి వివరించారు. గ్రౌండ్ ట్రూతింగ్, ఎల్‌పీ నంబర్ల జనరేషన్‌ను త్వరగా చేసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు సూచించారు. రీసర్వేలో ఒక రోవర్ రోజుకు 150 ఎకరాల భూమిని సర్వే చేసేలా చర్యలు తీసుకోవాలని పత్తికొండ ఆర్డీఓ మోహన్ దాస్‌ను ఆదేశించారు. గూడూరు మండలానికి సంబంధించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో సర్వే ఆలస్యమవుతోందని తహసీల్దార్ జేసీ దృష్టికి తీసుకురాగా..వెల్దుర్తి ఆర్ఐను గూడూరుకు వెళ్లి రీసర్వే పనులు చేయించాలని ఆర్‌డీఓ డి.హరిప్రసాద్‌ను ఆదేశించారు. ఖాతా మాస్టర్ అప్‌లోడ్‌లో పర్సనల్ ఇన్ఫర్మేషన్‌ను తహసీల్దార్ ద్వారా లాగిన అయి అడ్రస్సు, పేరు, ఫొటో, కులం మొదలగు వివరాలను ఇంగ్లిషు, తెలుగులలో తప్పులు ఉంటే సరి చేయాలని ఆదేశించింది. పెద్దకడబూరులో పంపిణీ చేసిన భూ హక్కు పత్రాలకు సంబంధించి ఈకైవేసీ పెండింగ్‌లో ఉందని, వెంటనే తహసీల్దార్ సంబంధిత రైతులతో మాట్లాడి చేయించాలన్నారు. వచ్చే వారం భూ పంపిణీలో భాగంగా అర్హులైన రైతులకు పట్టాలు పంపిణీ చేసే అవకాశం ఉందని, ఇంతలోపు అందుకు సంబంధించిన అన్ని పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. వన్ టైం సెటిల్‌మెంట్ కింద అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్ ల్యాండ్స్ కన్వర్షన్ చార్జెస్‌ను వసూలుచేయాలని, నీటి పన్నుకు సంబంధించి ప్రస్తుత, పాత బకాయిలు వసూలు చేసి చలాన్ల ద్వారా చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయండి..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు కోరుతున్న ప్రాజెక్టులకు భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జేసీ అధికారులను ఆదేశించారు. పెద్దకడబూరు, గవిగట్టులలో రైల్వే కోసం భూమిని కేటాయించాలని సంబంధిత తహసీల్దార్లను ఆదేశించారు. ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, ప్రాంతాల్లో సెబ్ కార్యాలయాల కోసం భూసేకరణ చేయాలన్నారు. కర్నూలు–ఆత్మకూరు జాతీయ రహదారి కోసం 69 ఎకరాలను కేటాయించాలన్నారు. ఆగస్టు 31వ తేదీ లోపు ఆదోని బైపాస్ రోడ్డు సర్వేకు సంబంధించి పనులను పూర్తి చేయాలన్నారు. ఓర్వకల్, గడివేముల మండలాల్లో పవర్‌గ్రిడ్, ట్రాన్స్‌కోకు సంబంధించిన భూములను త్వరగా సేకరించి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్‌ను ఆదేశించారు. బీఎస్ఎన్ఎల్, ఐఓసీ, ఏపీ టూరిజానికి కేటాయించాల్సిన ప్రదేశాల్లో భూములను చూడాలన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సంబంధించి అర్జీదారుల నుంచి సంతోషకర అభిప్రాయాన్ని తీసుకొని అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి



లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): దేశంలోనే ఎక్కడా లేవన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ కోరారు. శుక్రవారం 38వ వార్డు స్టాంటన్‌పురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కాలనీలో మురుగునీటి కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా వెంటనే పరిష్కరించాలని నగర పాలక సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించి, సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని కోరారు. కార్పొరేటర్లు గిప్సన్, సాంబ పాల్గొన్నారు.

28 నుంచి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కర్నూలు కల్చరల్: అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 28 నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ పేర్కొన్నారు. శ్రీ మహా గౌరీ పరదేవతా సన్నిధిలో ప్రతి రోజు ఉదయం 10 నుంచి 12 గంటలు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు శ్రీలలితా సహస్రనామ పారాయణ పూర్వక కోటి కుంకుమార్చన మహాయజ్ఞం జరుగుతుందని తెలిపారు.

పార్టీ బలోపేతానికి మరింత శ్రమిస్తా

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు, పార్టీ బలోపేతానికి మరింత శ్రమిస్తానని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ నగర అధ్యక్షుడు పి.రాజా విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దశాబ్ద కాలంగా పార్టీ కోసం శక్తి వంచన లేకుండా పనిచేశామని, దీంతో తన సతీమణి మహాలక్ష్మికి కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్‌గా రెండేళ్ల పాటు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రతి పేద వర్గాన్ని ఆదుకుంటుందని, మరోసారి సీఎం జగన్ అధికారంలోకి వస్తే వారికి మరింత మంచి జరుగుతుందని చెప్పారు.

విద్యుత్ బీ రోడ్ సెక్షన్ ఏఈగా సంజీవరెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ శాఖ కర్నూలు బళ్లారీ రోడ్డు సెక్షన్ ఆపరేషన్స్ ఏఈఈగా సంజీవరెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ ఏఈగా విధులు నిర్వహించిన రఫీక్ అహ్మద్‌ను సాధారణ బదిలీల్లో మద్దికెరకు బదిలీ చేశారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఈ సెక్షన్‌కు దీర్ఘకాలికంగా సెలవుల్లో ఉన్న సంజీవరెడ్డిని నియమిస్తూ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

'పనిచేయండి...ఏ పరికరం కావాలన్నా ఇస్తాం'

కర్నూలు(హాస్పిటల్): రోగులకు ఉత్తమ వైద్యసేవలు అందించేందుకు అవసరమైన వైద్యపరికరాలు ఏమి కావాలన్నా ఇచ్చేందుకు ప్రభుత్వం రెడీగా ఉందని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ చెప్పారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజిలోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ విభాగాల హెచ్‌ఓడీలతో ప్రిన్సిపాల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు ఆయా విభాగాలకు అవసరమైన వైద్యపరికరాలను ప్రతిపాదించాలన్నారు. ఈ మేరకు ఇప్పటికే అన్ని విభాగాలకు ఉత్తర్వులు పంపించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మునుపెన్నడూ లేని విధంగా వైద్యరంగాన్ని ఎంతో అభివృద్ధి చేస్తోందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, కాలేజీ ఏడీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఈఓ రమణ

కర్నూలు(రూరల్):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాని జయప్రదం చేయాలని జిల్లా క్రీడాశాఖ సీఈఓ రమణ, చీఫ్ కోచ్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో కర్నూలు, కల్లూరు మండలాల పీఈటీలు, పీడీలతో జిల్లా క్రీడాశాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ, చీఫ్ కోచ్ మాట్లాడుతూ.... మీ పరిధిలో ఉన్న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ క్రీడాకారులను, క్రీడా మైదానాలు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, అబ్రహం లింకన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు కోరారు. 85వ రాజ్యాంగ సవరణ ద్వారా రద్దు చేసిన క్యాచ్ అప్ రూల్ థియరీని తిరగదోడి ఎస్సీ, ఎస్టీ పదోన్నతుల్లో ప్రాథమిక దశలోనే రివర్స్ సీనియారిటీని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించడం శోచనీయమన్నారు. ఈ ప్రక్రియతో ఉద్యోగులకు జరిగే నష్టాన్ని వివరించేందుకు ఈ నెల 23వ తేదీన ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. శుక్రవారం స్థానిక సంక్షేమభవన్‌లో ఆ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సలహాదారు ఎస్‌సీహెచ్ బజారన్న, అధ్యక్షుడు వీఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు సుంకన్న, కోశాధికారి సంజీవ్, నాయకులు సురేంద్రకుమార్, రవికుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

బాల్యం అభివృద్ధిలో కుటుంబ పాత్ర కీలకం

- జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు



మాట్లాడుతున్న డీపీఓ నాగరాజునాయుడు

కర్నూలు(అర్బన్): బాల్యం అభివృద్ధిలో కుటుంబం, గ్రామం, చుట్టుపక్కల వాతావరణం కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా పంచాయతీ అధికారి టి. నాగరాజునాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ హైదరాబాద్, యునిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో సమగ్ర బాల్య వికాసం ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ...తల్లి గర్భం దాల్చినప్పటి నుంచి 6 సంవత్సరాల వయస్సు వరకు పిల్లల అభివృద్ధిని సూచిస్తుందన్నారు. మెదడు అభివృద్ధి, నాడీ నిర్మాణం పిల్లలు పెరిగే వాతావరణానికి చాలా దగ్గరగా ఉంటుందన్నారు. పిల్లల్లోని అభివృద్ధి జాప్యాలను ముందస్తుగా గుర్తించకపోతే శారీరక అభివృద్ధిని ప్రభావితం చేస్తాయన్నారు. పిల్లల ఎదుగుదల, ఆరోగ్య ఫలితాలను మెరుగుపరిచేందుకు, సురక్షితమైన వాతావరణాన్ని సృష్టించేందుకు కుటుంబ సంరక్షకుల పాత్ర ఎంతో ఉండాలన్నారు. పోషకాహార లోపం, బాల్య వికాస జాప్యాలను ముందుగానే గుర్తించడం, చికిత్స చేయడం వల్ల బాల్య వ్యాధులు, మరణాలను తగ్గించవచ్చన్నారు. ఈ నేపథ్యంలోనే 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో బాల్య వికాసం, అభివృద్ధిని కూడా చేర్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో యునిసెఫ్ హెల్త్ స్పెషలిస్టులు డా.శ్రీధర్ ర్యావంకి, డా.సలీమాభాటీయా, న్యూబోర్న్ అండ్ చైల్డ్ హెల్త్ కన్సల్టెంట్ విక్రమ్‌రెడ్డి, ఐఐపీహెచ్ – హెచ్ బృందం డా.రాజన్‌శుక్లా, డా.యశస్వినీ, డా.నిరుపమ, డా.జనసీచారీ, డా.ఎన్‌జీ మరీనాదేవి, డా.కె. కిరణ్, డా.రాజీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై నిరసన హోరు

- దోషులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాలు డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్)/(రూరల్) (న్యూసిటీ): మణిపూర్‌లో మహిళలను నగ్నంగా తిప్పిన ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలని ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. కర్నూలు కలెక్టరేట్ ఎదుట కేవీపీఎస్, ఐద్వా, డీవైఎఫ్ఐ, ఆర్‌వీఎస్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది.ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు ఎండీ ఆనందబాబు అలివేలమ్మ, నగేష్, గురుశేఖర్, అబ్దుల్లా మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా తిప్పిన మానవ మృగాలు, ఒంగోలులో గిరిజనుడిపై మూత్రం పోసిన వారిని అరెస్టు చేయాలన్నారు.

- మణిపూర్‌లో మహిళలపై అత్యాచారానికి పాల్పడిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. కొన్ని నెలలుగా మణిపూర్‌లో అల్లర్లు చెలరేగుతున్నా కేంద్రం పట్టించుకోవడంలేదన్నారు.
- మణిపూర్‌లో మహిళలపై జరిగిన అత్యాచార ఘటన బాధాకరమని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన గోకారి భవన్లో మాట్లాడుతూ..ప్రధానమంత్రి గుజరాత్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో గోద్రా అల్లర్లు జరిగాయన్నారు. ఇప్పుడు మళ్లీ ఆయన ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో మణిపూర్‌లో రెండు కులాల మధ్య హింస చెలరేగుతుందన్నారు.
- మణిపూర్‌లోని బి.ఫయానోమ్ గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలను పోలీసు బలగాల నుంచి తీసుకెళ్లి నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారానికి పాల్పడిన సంఘటనపై విచారణకు ఆదేశించాలని అఖిల భారత మహిళా సాంస్కృతిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు తేజోవతి డిమాండ్ చేశారు.
- మణిపూర్‌లో మహిళలను నగ్నంగా తిప్పిన ఘటనలోని దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అలివేలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట కొవ్వొతుల ప్రదర్శన నిర్వహించారు.
- మణిపూర్‌లో జరిగిన సంఘటనకు బాధ్యులైన మానవ మృగాలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ ఉపాధ్యక్షుడు ఏవీఎస్ బాబురాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తుంటే బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.



ఈ ఆహారం తింటే...

చినుకుల్లోనూ చింత ఉండదిక

నిన్న మొన్నటి దాకా చెమటలు పట్టించిన ఎండలు కాస్తా ఇప్పుడు మబ్బుల వెనక దాక్కుని, వానలు కురిపిస్తున్నాయి. వానలు ఆహ్లాదంగానే ఉంటాయి. అయితే సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధులను కూడా వెంట మోసుకొస్తాయి. ఈ అనారోగ్యాలతో పోరాడటానికి. రోగనిరోధకశక్తి బలంగా ఉండటం చాలా ముఖ్యం. వర్షాకాలంలో వ్యాధి నిరోధక శక్తిని మరింత పెంచుకోవడానికి నిత్యం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం అవసరం. ఆ మార్పులేమిటో, ఈ సీజన్‌లో ఏ ఆహారం తీసుకుంటే మంచిదో చూద్దాం...



ముసురు పట్టినప్పుడు వేడి వేడి టీ, కాఫీలు తాగుతుంటారు. అయితే వాటికి బదులు గ్రీన్ టీ, బ్లాక్ టీ, హెర్బల్ టీ వంటివి తీసుకోవాలి. దాంతోపాటు అల్లం, మిరియాలు, తేనెతో తయారు చేసిన టీ సేవిస్తే.. ఆరోగ్యానికి చాలా మంచిది. అదేవిధంగా బజ్జీలు, పునుగులు, బోండాలకు బదులు వేడి వేడి ఉగ్గాణి, సెనగ, పెసర గుగ్గిళ్లు, చుదువా, సగ్గుబియ్యం కిచిడీ మంచిది. పుదీనా, తులసి ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు అధికంగా ఉంటాయి కాబట్టి వీటితో కషాయం కాచుకుని తాగితే మంచిది. రాగులు, సోయా బీన్స్, పెసలు, మొక్కజొన్న వంటి పప్పుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకుంటే ఎలాంటి అనారోగ్య సమస్యలూ దరిచేరవు. వీటితోపాటు పోషక విలువలు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లు అంటే దానిమ్మ, ఆపిల్, స్ట్రాబెర్రీ, అరటి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బచ్చలి కూర వంటివి తీసుకుంటే మంచిది.



అల్లం: ఇది శరీర కణజాలాలకు పోషకాలను సమీకరించడానికి, సరఫరా చేయడానికి తోడ్పడుతుంది. ఈ రోజుల్లో జలుబు, దగ్గు వంటి సమస్యలు సర్వసాధారణం. అల్లం కఫాన్ని తగ్గిస్తుంది కాబట్టి అల్లం టీ తాగితే జలుబు, దగ్గు దూరం అవుతాయి. ఫ్లూతో పోరాడటానికి అల్లం తోడ్పడుతుంది. అల్లంలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తినీ మెరుగుపరుస్తాయి. టీలు, సూప్‌లు, కూరల్లో అల్లాన్ని ఎక్కువ ఉపయోగిస్తే వ్యాధి నిరోధకతను పెంచుకోవచ్చు.



నేరేడు పండు... ఈ పండులో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలూ ఫైటోకెమికల్స్ రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. నేరేడులో క్యాలరీలు తక్కువ. వానాకాలంలో వచ్చే అతిసార, కలరా వ్యాధులతో పాటు ఇతరత్రా ఇన్ఫెక్షన్లకీ నేరేడు ఔషధంలా పనిచేస్తుంది.



తులసి... ఈ కాలంలో రోజూ తులసి ఆకులను నమలడం ద్వారా అనారోగ్యాల నుంచి రక్షణ పొందవచ్చు. ఐదు తులసి ఆకులను రాత్రంతా నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం పరగడుపునే ఆ ఆకులు తిని.. నీటిని తాగాలి. తులసి రోగనిరోధక వ్యవస్థను బూస్ట్ చేస్తుంది.



నిమ్మ... నిమ్మరసంలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. అంతేకాదు, శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది. ఇది ఇన్ఫెక్షన్లు, అంటువ్యాధుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది.



మిరియాలు... నల్ల మిరియాలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడతాయి. జీవక్రియలను పెంచుతాయి. దగ్గు, గొంతు నొప్పి ఉన్నట్లయితే నల్ల మిరియాలను పొడి చేసి నిద్రవేళకు ముందు వేడి పాలలో కలుపుకొని తాగితే ఆరోగ్యానికి చాలా మంచిది.

పసుపు... పసుపులో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. రోజూ రాత్రిపూట చిటికడు పసుపు కలిపిన వేడి పాలు తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

వీటికి దూరంగా ఉండటం మేలు!

రోగనిరోధక శక్తిని బలోపేతం చేయాలంటే చక్కెర పదార్థాలకి దూరంగా ఉండాలి. ముఖ్యంగా ఐస్ క్రీం, కేక్, క్యాండీ, చాక్లెట్, కూల్‌డ్రింక్స్ తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. అలాగే ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారాలు ఆరోగ్యానికి చాలా హాని కలిగిస్తాయి. రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తాయి. చాలామంది ప్యాక్ చేసిన ఆహారాలని తినడానికి ఎక్కువగా ఇష్టపడుతారు. కానీ ఇవి ఆరోగ్యానికి మంచివి కావు. అధిక ఉప్పు ఆటో ఇమ్యూన్ వ్యాధి ప్రమాదాన్ని పెంచుతుంది. అలాగే ఆల్కహాల్, ధూమపానం కూడా శరీరాన్ని బలహీనంగా మారుస్తాయి. అందుకే వీటికి వీలైనంత దూరంగా ఉంటే మేలు.



లవంగం... ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి పనిచేస్తుంది. వర్షాకాలంలో లవంగాలను తీసుకుంటే గొంతు నొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.



దాల్చిన చెక్క... అద్భుత ఔషధ గుణాలెన్నో దాగి ఉన్న దాల్చిన చెక్క మధుమేహులకు రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది. రోజూ గ్లాసు పాలలో దాల్చిన చెక్క పొడి కలుపుకొని తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంతేకాదు, శరీరంలో ఉండే కొవ్వు శాతాన్ని తగ్గించే గుణం దీనిలో ఇమిడి ఉంది.

బడికి వెళ్లనని మారాం చేస్తున్నారా?

ఉదయాన్నే పిల్లల్ని తయారు చేసి స్కూలుకు పంపించడం పేరెంట్స్‌కు పెద్దపని. ఇంతకంటే వాళ్లను నిద్రలేపడం అతిపెద్ద టాస్క్. ఎంత లేపినా నిద్ర లేవరు. కింద స్కూల్ ఆటోనో, బస్సో వచ్చి హారన్ కొడుతుంటుంది. కానీ వీళ్లు లేవరు. వీళ్లను తొందరగా నిద్ర లేపాలంటే ఇలా ప్రయత్నించి చూడండి....



సమస్యను అర్థం చేసుకోవాలి
ముందుగా నిద్ర లేవడానికి ఏమైనా ఇబ్బంది పడుతున్నారేమో గమనించాలి. రాత్రి సరిగా పడుకున్నారా లేదా... అసలు నిద్రపట్టలేదా... ఇంకేదైనా సమస్య ఉంటే అనునయంగా అడిగి తెలుసుకోవాలి.

సరిపోయిందా లేదా?
స్కూలుకెళ్లే పిల్లలు కనీసం పదిగంటలు నిద్రపోవాలి. గేమ్స్, ఫోన్లు చూస్తూ సరిగా పడుకోరు. రోజూ ఒక నిర్దేశిత సమయాన్ని కేటాయించి వాళ్లు కచ్చితంగా పడుకునేలా చేయాలి.

ప్రేమతో లేపాలి
ఉదయం ఎంత ఉత్సాహంగా లేస్తే రోజంతా అలానే గడుస్తుంది. అందుకే పిల్లలు త్వరగా లేవకపోయినా ప్రేమగా నిద్రలేపాలి. పిల్లలకు అర్థమయ్యే ప్రేమ భాషలోనే నిద్ర లేపాలి. ఇందుకోసం వాళ్లకు నచ్చే మంచి విషయాలు, స్కూలుకు వెళ్లడం ఎంతముఖ్యమో ప్రేమతో చెప్పాలి.

ఇష్టమైన ఫుడ్
పిల్లలు ఇష్టంగా తినే ఆహారాన్ని బ్రేక్‌ఫాస్ట్‌లో ఇవ్వాలి. అది తినడం కోసం అయినా త్వరగా నిద్ర లేస్తారు. ఈ నాలుగు చిట్కాలు ప్రయత్నిస్తే మీ సమస్య తీరినట్టే.

దిండు లేకుండా పడుకోలేరా?

రాత్రిపూట నిద్రించేటప్పుడు చాలా మంది తలకింద దిండు పెట్టుకొని పడుకుంటారు. అయితే తక్కువ ఎత్తు ఉన్న దిండు ఫరవాలేదు కానీ, పెద్ద దిండు పెట్టుకోవడం వల్ల చాలా ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయి. ఇది మొదట్లో తెలియదు కానీ కొన్ని రోజులు గడిచిన తర్వాత ముందుగా మెడ నొప్పి ఎదురవుతుంది. ఈ నొప్పి దీర్ఘకాలికంగా వేధిస్తుంది. కొంతమందికి ఉదయం నిద్రలేవగానే వెన్నులో నొప్పితో బాధపడతారు. మీకు ఇలాంటి సమస్య ఎదురైతే పడుకునేటప్పుడు మీరు ఎత్తయిన దిండు ఉపయోగిస్తున్నట్లు లెక్క. దీనివల్ల వెన్నెముక వంగిపోతుంది. డిస్క్‌లలో దూరం పెరిగి వెన్నునొప్పి వస్తుంది. అందువల్ల దిండు లేకుండా నిద్రించడం అలవాటు చేసుకోవాలి.



తలలో రక్త ప్రసరణ జరగదు: ఎత్తయిన దిండు పెట్టుకొని నిద్రపోతే తలకి రక్త సరఫరా సరిగ్గా జరగదు. రాత్రిపూట చాలా గంటలు ఇలాగే ఉండటం వల్ల రక్త సరఫరా లేక జుట్టుకు సరైన పోషణ లభించదు. దీనివల్ల జుట్టు రాలే సమస్య మొదలవుతుంది. అంతేకాదు, తరచు తలనొప్పి వస్తుంది. లావుపాటి దిండు పెట్టుకొని నిద్రించడం వల్ల శరీరంలోని కొన్ని భాగాలకి రక్త సరఫరా సరిగ్గా అందక తిమ్మిర్ల సమస్యలు ఏర్పడుతాయి. అందువల్ల మెడనొప్పి ఉండకూడదంటే తక్కువ ఎత్తు ఉండే చిన్న దిండుని ఉపయోగించాలి లేదంటే మెత్తటి టవల్ లేదా పలుచటి దుప్పటిని మడత పెట్టి తలకింద పెట్టుకోవడం ఉత్తమం.

హెల్త్ టిప్స్



మందారం ఆకుల్ని నూరి షాంపూగా వాడితే జుత్తు బాగా పెరుగుతుంది. చుండ్రు నివారణలోనూ, తెల్ల వెంట్రుకల నిరోధకంలోనూ సాయమవుతుంది. కప్పు నీటిలో ఒక మందార పువ్వు వేసి మరిగించి ఆ నీళ్లను తాగితే రక్తంలో ఐరన్ పెరుగుతుంది.



కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఓ 10 ఆకులతో పేస్ట్ తయారు చేసి మజ్జిగలో కలిపేసుకుని రోజూ తాగితే కాలేయం వ్యర్థపదార్థాల నుంచి రక్షణ పొందుతుంది. రోజూ ఓ 8 ఆకుల్ని మిరియాలతో కలిపి తింటే ముక్కులో వచ్చే అలర్జీలు తగ్గిపోతాయి.



రోజూ రెండు మూడు పుదీనా ఆకుల్ని నమిలి మింగుతుంటే జీర్ణశక్తి పెరిగి, కడుపు ఉబ్బరం, తేన్పులు తగ్గుతాయి. శ్వాసకోశాల శక్తి పెరుగుతుంది.



వేపాకు, యాంటీ సెప్టిక్‌గానూ, క్రిమి సంహారిణిగానూ బాగా పనిచేస్తుంది. వేపాకు పొడిని నీళ్లల్లో కలిపి చల్లితే ఎన్నో రకాల క్రిమి కీటకాలు దూరంగా వెళ్లిపోతాయి. వేపాకుల్ని నీటిలో వేసి మరిగించి స్ప్రే చేస్తే దోమల బెడద తప్పుతుంది. వేపాకు పొడిని పేస్ట్‌గా చేసి వాడితే పలు రకాల చర్మ సమస్యలు, మొటిమలు, ఎగ్జిమాల బాధలు తప్పుతాయి.

పసుపును పేస్ట్‌గా రోజూ ముఖానికి వాడితే, ముఖం మీద ఉండే సన్నని వెంట్రుకలు రాలిపోతాయి. అలాగే మొటిమలు, మచ్చలు కూడా మాయమవుతాయి. ఇది గొప్ప యాంటీ ఆక్సిడెంటు కాబట్టి రోజు మొత్తంలో ఒక టీ స్పూను దాకా కడుపులోకి తీసుకోవచ్చు.



సినిమా

అంతం ఆరంభమవుతుంది!


ప్రభాస్

వెండితెరపై ప్రభాస్ కల్కి అవతారం ఎత్తారు. ప్రభాస్, కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ముఖ్య తారలుగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'ప్రాజెక్ట్ కె' వర్కింగ్ టైటిల్‌తో ఓ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న 'శాన్ డియాగో కామిక్ కాన్ – 2023' వేడుకలో ఈ సినిమాకు 'కల్కి 2898 ఏడీ' టైటిల్‌ను ఖరారు చేసినట్లు శుక్రవారం వెల్లడించి, గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. 'ప్రపంచాన్ని చీకటి కమ్మేసినప్పుడు ఒక శక్తి ఉద్భవిస్తుంది. అప్పుడు అంతం ఆరంభం అవుతుంది' అన్నట్లుగా ఈ వీడియోలో ఉంది. ఈ వేడుకలో కమల్‌హాసన్ మాట్లాడుతూ– ''మేం స్టోరీలు చేస్తుంటే వారు (ఆడియన్స్) మమ్మల్ని స్టార్స్ చేస్తున్నారు. 'కల్కి 2898 ఏడీ'లో పెద్ద విజన్ ఉంది. ఈ సినిమాలో భాగం కావడం గౌరవంగా ఉంది'' అన్నారు. ''ఈ సినిమాలో నాగ్ అశ్విన్ నా క్యారెక్టర్‌ను డిజైన్ చేసిన తీరు బాగా నచ్చింది. సినిమాలో స్ట్రాంగ్ ఎమోషన్స్ ఉన్నాయి'' అన్నారు ప్రభాస్. ''ఈ సినిమా నాకో అద్భుతమైన అనుభవం. దీని వెనక గొప్ప పరిశోధన ఉంది'' అని వర్చ్యువల్‌గా అమితాబ్ బచ్చన్ మాట్లాడారు. ''నేను సైన్స్ ఫిక్షన్, పురాణాలను ఇష్టపడతాను. మహాభారతం, స్టార్ వార్స్... రెండింటినీ చూస్తూ, వింటూ పెరిగాను. ఈ రెండు ప్రపంచాలను కలిపే ఒక గొప్ప సినిమా చేయాలనుకున్నప్పుడు 'కల్కి 2898 ఏడీ' పుట్టింది'' అన్నారు నాగ్ అశ్విన్. ''ఈ సినిమా మాకు గర్వ కారణం'' అన్నారు నిర్మాత అశ్వనీదత్. ఈ వేడుకలో రానా, ప్రియాంకా దత్, స్వప్నా దత్ పాల్గొన్నారు. 'కల్కి 2898 ఏడీ'ను 2024 జనవరి 12న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తా: ప్రభాస్

రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తానని ప్రభాస్ 'కామిక్ కాన్–2023' వేడుకల్లో చెప్పారు. ఈ వేడుకల్లో 'ఆర్ఆర్ఆర్' సినిమా ప్రస్తావన రాగా... ''భారతదేశంలో ఉన్న అద్భుతమైన దర్శకుల్లో రాజమౌళి గారు ఒకరు. 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని పాటకు ఆస్కార్ రావడం నాకు చాలా సంతోషంగా అనిపించింది. అది దేశ ప్రజలందరికీ దక్కిన గౌరవంగా భావించాం. అలాగే రామ్‌చరణ్ నాకు మంచి మిత్రుడు. ఏదో ఒక రోజు మేం కచ్చితంగా కలిసి సినిమా చేస్తాం'' అని చెప్పుకొచ్చారు ప్రభాస్.


చిరంజీవి, తమన్నా

మిల్కీ బ్యూటీ... నువ్వే నా స్వీటీ

'అచ్చ తెలుగు పచ్చి మిర్చి మగాడు వీడే.. బొంబాటు ఘాటు హాటు హాటుగున్నాడే.. కల్లోకి వచ్చేసి కన్నెగుండెల్లో సూది గుచ్చి పిల్లా నీ ముచ్చటేంది అన్నాడే...' అంటూ రొమాంటిక్ మోడ్‌లోకి వెళ్లిపోయారు హీరోయిన్ తమన్నా. చిరంజీవి టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రంలో చిరంజీవి సరసన తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటించారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది. ఈ చిత్రంలోని 'మిల్కీ బ్యూటీ.. నువ్వే నా స్వీటీ..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను విజయ్ ప్రకాష్, సంజన కల్మంజేతో కలసి ఈ చిత్ర సంగీతదర్శకుడు మహతి స్వర సాగర్ ఆలపించారు.


సుదీప్, అమలాపాల్

యాక్షన్ హెబ్బులి

సుదీప్, అమలా పాల్ జంటగా ఎస్. కృష్ణ దర్శకత్వంలో రూపొందిన కన్నడ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'హెబ్బులి'. ఈ సినిమాను అదే టైటిల్‌తో సి. సుబ్రహ్మణ్యం ఆగస్టు 4న తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ– ''ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, రొమాంటిక్ సీన్స్ మిళితమై ఉన్న పక్కా కమర్షియల్ ఫిల్మ్ 'హెబ్బులి'. కన్నడంలో రూ. 100 కోట్లు సాధించింది. తెలుగులోనూ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.


వైష్ణవ్ తేజ్


మహేశ్‌బాబు


టొవినో థామస్

కిక్... పంచ్...

విలన్ ముఖం మీద హీరో పంచ్ ఇవ్వాలా? కాలితో ఒక్క కిక్ కొట్టాలా? గాల్లో ఎగిరి పల్టీలు కొట్టి మరీ విలన్‌ని కొట్టాలా? ఇవన్నీ చేయాలంటే కాస్త ట్రైనింగ్ కావాలి. రెగ్యులర్ ఫైట్స్‌కి అయితే అక్కర్లేదు. బీభత్సమైన ఫైట్స్‌కి అయితే శిక్షణ తీసుకోవాల్సిందే. అది హీరో అయినా హీరోయిన్ అయినా. ఈ మధ్య రిస్కీ రోల్స్ ఒప్పుకున్న కొందరు స్టార్స్ 'మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్' నేర్చుకోవడానికి ప్రిపేర్ అయ్యారు. కిక్ బాక్సింగ్, కరాటే, కుంగ్ ఫూ, జూడో, కలరి పయట్టు వంటివన్నీ మార్షల్ ఆర్ట్స్ కిందే వస్తాయి. ఫైట్‌కి సూట్ అయ్యే ఆర్ట్ నేర్చుకుని బరిలోకి దిగనున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.

మూడు నెలలు బ్యాంకాక్‌లో...
హీరో మహేశ్‌బాబు– డైరెక్టర్ రాజమౌళి కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. ఆఫ్రికన్ అడవుల నేపథ్యంలో జరిగే ఈ కథలో భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయట. పోరాట సన్నివేశాలు సహజంగా ఉండేందుకు కెరీర్‌లో తొలిసారి ఈ సినిమా కోసం మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోనున్నారట మహేశ్ బాబు. ఇందుకోసం మూడు నెలల పాటు బ్యాంకాక్ వెళతారని టాక్. అక్కడ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్, హైకింగ్, ట్రెక్కింగ్ వంటివి నేర్చుకోనున్నారట. ఈ శిక్షణ ఇవ్వనున్న బ్యాంకాక్ స్టంట్ టీమ్‌కి ఓ హాలీవుడ్ ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ నేతృత్వం వహిస్తారని తెలిసింది. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న 'గుంటూరు కారం'లో నటిస్తున్నారు మహేశ్‌బాబు. ఈ చిత్రం పూర్తయ్యాక బ్యాంకాక్‌లో శిక్షణ తీసుకుని, రాజమౌళి సినిమా షూట్‌లో జాయిన్ అవుతారట. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు రాజమౌళి. ఈ చిత్రానికి రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ కథ అందిస్తున్న సంగతి తెలిసిందే.

థాయ్‌ల్యాండ్‌లో...
తొలి చిత్రం 'ఉప్పెన'తో (2021) బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు వైష్ణవ్ తేజ్. ఆ తర్వాత 'కొండపొలం, రంగ రంగ వైభవంగా' వంటి చిత్రాల్లో నటించారు. ఈ మూడు చిత్రాల్లో సాఫ్ట్ క్యారెక్టర్‌తో ప్రేక్షకులను అలరించిన ఆయన తొలిసారి 'ఆదికేశవ' చిత్రంలో ఫుల్ యాక్షన్ రోల్ చేశారు. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హై ఓల్టేజ్ యాక్షన్ సన్నివేశాల కోసం థాయ్‌ల్యాండ్‌లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు వైష్ణవ్ తేజ్. ఈ చిత్రంలో వైష్ణవ్‌కు జోడీగా శ్రీలీల నటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 18న రిలీజ్ కానుంది.


కాజల్

కలరి మార్షల్ ఆర్ట్‌లో...
మలయాళ హీరో టొవినో థామస్ కలరి అనే మార్షల్ ఆర్ట్‌లో శిక్షణ పొందారు. టొవినో థామస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'అజయంతే రండం మోషణం'. జితిన్ లాల్ దర్శకత్వం వహిస్తున్నారు. కథ పరంగా కేరళలోని కలరి అనే మార్షల్ ఆర్ట్‌కు ఈ చిత్రంలో ప్రాధాన్యం ఉండటంతో టొవినో థామస్ ఈ విద్యలో శిక్షణ తీసుకుని నటిస్తున్నారు. ఈ చిత్రంలో కృతీ శెట్టి, ఐశ్వర్య రాజేష్, సురభి లక్ష్మి హీరోయిన్లుగా నటిస్తున్నారు.

భారతీయుడు కోసం...
కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'భారతీయుడు 2' కోసం కాజల్ అగర్వాల్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు. 'భారతీయుడు' (1996) సినిమాకి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' (తమిళంలో 'ఇండియన్ 2) రూపొందుతోంది. ఈ చిత్రంలో కమల్‌కు జోడీగా కాజల్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ ఫైట్స్ చేయడం కోసం అతిపురాతనమైన యుద్ధ క్రీడ కలరి పయట్టు నేర్చుకున్నారు కాజల్. కలరి సాధన చేస్తున్న ఓ వీడియోను ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, 'షావోలిన్, కుంగ్ ఫూ, కరాటే, తైక్వాండో.. వంటి క్రీడలు కలరి నుంచి పుట్టుకొచ్చినవే' అని పేర్కొన్నారామె. ఈ మూవీ కోసం గుర్రపు స్వారీ కూడా నేర్చుకున్నారు కాజల్ అగర్వాల్.

కోలీవుడ్‌లో ఫెఫ్సీ కొత్త నిబంధనలు

● సినిమా షూటింగ్‌లకు ఫెఫ్సీ కొత్త నియమాలు ● వెల్లువెత్తుతున్న విమర్శలు

దక్షిణ భారత సినీ కార్మికుల సంఘం (ఫెఫ్సీ) కొత్త నియమ, నిబంధనలు కోలీవుడ్‌లో చర్చనీయాంశమయ్యాయి. తమిళ చిత్రాలకు స్థానిక నటీనటులు, సాంకేతిక నిపుణులు మాత్రమే పని చేయాలని, తమిళ సినిమాల చిత్రీకరణలు తమిళనాడులోనే జరగాలని, సరైన కారణాలు లేనిదే అవుట్‌డోర్ లొకేషన్స్‌లో షూటింగ్ జరపకూడదని ఫెఫ్సీ కొత్త నియమాలు చేసిందని సమాచారం. అలాగే అనుకున్న సమయంలోపు సినిమా చిత్రీకరణ పూర్తి కాకపోయినా, బడ్జెట్ పరిమితి దాటినా నిర్మాతలకు సరైన కారణాలతో లిఖిత పూర్వకమైన లేఖను సమర్పించాలని, ఒకవేళ ఓ సినిమాకు దర్శకుడే రచయిత అయితే, ఆ సినిమా కథకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే అతనే పరిష్కరించుకోవాలని, ఆ సమస్య ప్రభావం షూటింగ్, నిర్మాతలపై పడకుండా జాగ్రత్త వహించే బాధ్యత కూడా ఆ వ్యక్తే తీసుకోవాలన్నట్లుగా కొన్ని నియమాలను 'ఫెఫ్సీ' తీసుకొచ్చిందట. ఈ కొత్త నిర్ణయాలపై కోలీవుడ్‌లోనే కాదు.. సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'ఈ నిబంధనలు ఉన్నప్పుడు తమిళ సినిమాలను తమిళనాడులోనే రిలీజ్ చేసుకోవాలి. కోలీవుడ్‌లో హీరోయిన్లకు కొరత ఏర్పడుతుంది. సినిమాకి వాడే సాంకేతిక సామాగ్రిని కూడా తమిళనాడులోనే తయారుచేసుకోవాలి' అంటూ ఫెఫ్సీ నియమాలపై సోషల్ మీడియాలో కొందరు నెటిజన్లు వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. అయితే ఈ కొత్త నియమాలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి పేర్కొన్నారట.